ప్ర బు ద్ధు డు!

శ్రీ జి. వజ్రం

సిద్ధార్థుడు తన భార్య యశోధరను నిద్రిస్తూ ఉండగా విడచివెళ్ళిపోయినాడు. బ్రహ్మజ్ఞానము పొంది తిరిగివచ్చినాడు. అప్పుడు యశోధర సిద్ధార్థుని విశిష్టతను అంగీకరించి ఆయన శిష్యత్వాన్ను స్వీకరించినది. లక్ష్మినివదలి ఆమె భర్త ప్రొఫెసర్. మూర్తి అర్ధరాత్రివేళ ఎచ్చటికో వెళ్ళిపోయినాడు. ఆయన ఎన్నటికైన తిరిగివచ్చునా? తిరిగివస్తే ఎలా వచ్చును? అన్న విషయం ఎవరికీ తెలియదు. కాని లక్ష్మి మాత్రం దుఃఖసాగరములో మునిగివున్నది. ఆమె ఆలోచనాశక్తిపనిచేయడంలేదు. మనస్సు అశాంతితోనిండి ఉన్నది. వెంట్రుకలు అస్తవ్యస్తంగా ముఖముపై వ్రేలాడుచున్నవి. ముఖము వాడిన పుష్పమువలె - వాడి ఉన్నది. నేత్రములనుంచి, అశ్రుధారలు ఆమె చెక్కిళ్ళపైపడి క్రిందకు ప్రవహిస్తున్నవి. 18 సంవత్సరముల నవయువతి లక్ష్మి ముఖము అర్ధమూర్ఛితురాలైన 30 సంవత్సరముల ప్రౌఢ స్త్రీ ముఖమువలె కన్పిస్తున్నది. లక్ష్మికి ప్రపంచమంతా అంధకారాచ్ఛాదితమగుచున్నట్లుగా గోచరిస్తున్నది. అప్పుడే నీలాకాశములోని మెఱుపువలె అంధకారాచ్ఛాదితమైన ఆ వాతావరణములో తన భర్త ఉత్తరం ఆమెచేతి కివ్వబడినది. అందులో యిలావుంది:—

లక్ష్మి!

నేను పోవుచున్నాను. ఎచ్చటికో తెలియదు. ఎచ్చటికని నీవు ప్రశ్నించవచ్చు - తిరిగి వచ్చిన తరువాతనే దానికి నేను జవాబు చెప్పగలను. కాని ఎప్పుడు తిరిగిరాగలనో చెప్పలేను. అయినప్పటికిన్ని బ్రతికిఉండగనే తిరిగి రాగలనన్న ఆశ మాత్రం నా హృదయంలోవుంది.

నీపై లేక మన కుటుంబములోని మరెవ్వరిపై అయిష్టతవల్ల నేను వెళ్ళిపోయినానని నీవు కలలోగూడ తలచవద్దు. నిజంగా యీ ప్రపంచములో నీవే నా హృదయాన్ని ఆకర్షించెడి సూదంటురాయివి.

నిన్ను మన వైవాహిక జీవితంనుంచి విముక్తురాలుంగాచేసి వెళ్ళితే బాగుంటుందని నేను భావించినాను. కాని అందుకు నా మనస్సు అంగీకరించడము లేదు. అదియునుగాక అది నీకు సుతరాం యిష్టముండదని నా తలంపు.

నీవు నా తల్లిదండ్రుల సంరక్షణలో ఉందువుగాన యిచ్చట నీకెలాంటి కష్టముండదు.

నీవు యిప్పుడు నిద్రాదేవి ఒడిలో హాయిగా నిద్రిస్తున్నావు. పూర్ణచంద్రునివలె ప్రకాశించెడి నీ ముఖము నన్నెంతో ఆకర్షిస్తున్నది. అది నా లక్ష్యసిద్ధికి అడ్డువచ్చేటట్లున్నది. కనుక వెంటనే వెళ్ళిపోవుచున్నాను.

ఒక ప్రశ్నకి జవాబు పొందుటకు వెళ్ళిపోవుచున్నాను. జవాబు పొందిన వెంటనే తిరిగి వచ్చెదను.

'మూర్తి'

ఉత్తరములోని ప్రతి అక్షరము లక్ష్మి హృదయాన్ని శల్యములవలె బాధించినది. ఆ బాధను భరించలేక ఆమె ఒక చిన్న పిల్లవలె విలపించినది. ఆయన ఎందుకు వెళ్ళిపోయినారు? ఏ అభావము వల్ల వెళ్ళిపోయినారు? నా వల్ల ఏమయిన తప్పిదము జరిగినదా? ఆమె బుద్ధి పనిచేయడంలేదు. ఆమె భర్త ఎం. ఎ. డి. ఫిల్ యూనివర్శిటిలో సీనియర్ ప్రొఫెసరు. ఆయన ఏ ప్రశ్నకి జవాబు పొందుటకు భార్యను, తల్లిదండ్రులను, విడచివెళ్ళినారు? ఇక నా గతి ఏమిటి? భవిష్యత్తు ఏమిటి? భవిష్యత్తుయొక్క ఒక భయంకరమైన దృశ్యము ఆమె కండ్లకు కన్పించినది. వయస్సులో ఏకాకి జీవిత

మను ఎలా సహించగలను? నా భావి కల్పనలు, ఆశలు, ఆకాంక్షలు ప్రచండ తుఫానులోని మేఘములవలె ఎగిరిపోవలసినదేనా? నా యీ జీవితం కంటె మృత్యువు అనేకరెట్లు ఉత్కృష్టమైనది. జీవితములో ఎప్పుడో ఒకప్పుడు మృత్యువుకి బలికాక తప్పదు. అది నేడే ఎందుకు కాకూడదు? కాని ఆమె స్వయముగా మృత్యువును ఎలా ఆహ్వానించగలదు? ఈ యింటిలో ఆమెను ఎవ్వరు ఆత్మహత్యచేసుకోనివ్వగలరు? అత్తమామ ముసలివారు. వారికిమట్టుకు యింకెవ్వరున్నారు? అప్పుడే ఆమె తన గది తలుపు కదలిన ధ్వని విన్నది.

“లక్ష్మి, చింతించకు, మూర్తి తప్పక వస్తాడు” అంటూ రెండు రోజులనుంచి అన్నపానీయము లెరుగక శుష్కించిఉన్న అత్త ఆ గదిలోకి ప్రవేశించినది. లక్ష్మి అత్తను చూడగనే లేచి ఆమెను గట్టిగా పట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చినది.

“లేదుతల్లీ, యిట్లు అధైర్యపడకూడదు. మూర్తి తప్పక వస్తాడని నాకు నమ్మకం ఉన్నది. లేచి స్నానంచెయ్యి, బట్టలు మార్చుకో” లక్ష్మిని తవుడుకొంటూ అత్త రుద్గత కంఠముతో అన్నది.

◆ ◆ ◆

నెల గడచినది. ఒక సంవత్సరంగూడ గడచిపోయినది. లక్ష్మి అచ్చట యూనివర్శిటిలో తన భర్త విషయం తీసుకొని ఎం. ఏ లో తన పేరు వ్రాయించినది. ఆమె యింతకుముందే బి. ఎ. ప్యాసై ఉన్నది. అయితే అప్పుడు ఆమె జ్ఞాన సంపాదనకోసం అధ్యయనంచేయలేదు. ఆరోజులలో అమ్మాయి బాగా చదువుకోకపోతే మంచి వరుడు ఆమెను లభించడని ఆమె తల్లి దండ్రులు అంతవరకు చదివించినారు.

◆ ◆ ◆

ఎనిమిది సంవత్సరముల తరువాత—

శ్రీమతి లక్ష్మి ఎం. ఎ. పి. హెచ్. డి. లో ప్యాసై అచ్చట కాలేజిలోనే అసిస్టెంటు ప్రొఫెసరుగా చేరినది. నేడు ఆమె తెలుగులో ఒక ప్రముఖ రచయిత, ఈరోజున ఆమె తన కాలేజీలో పనిపూర్తిచేసుకొని సాయంత్రం 6 ఘంటలకు స్థానిక సాహిత్య పరిషద్‌లో అధ్యక్షోపన్యాసమిచ్చి రాత్రి 8 ఘంటలకు యింటికి చేరుకొన్నది, కార్యభారంవల్ల అలసిపోయినట్లున్నది, త్వరగా భోజనం చేసి పండుకున్నది. రేపు ఒకే ఒక క్లాసు ఉన్నది. కావలసినంత విశ్రాంతి ఉంటుంది. అప్పుడే తన భర్త జ్ఞాపకంవచ్చినాడు. ఎచ్చట ఉన్నాడో, ఏమిచేస్తున్నాడో? అసలు యీ ప్రపంచంలో ఉన్నాడో లేడో? ఆమె హృదయం కంపించినది. సహించలేనటువంటిబాధ, ఆవేదన, నిద్రించుటకు ప్రయత్నిస్తుంది. కాని మనస్సులో కలవరము ఉన్నందువల్ల నిద్రపట్టడంలేదు. తన భర్త రూపము కళ్లకు కట్టినట్లు కన్పిస్తుంది. గంభీరమైన ముఖము, ప్రకాశవంతములైన నేత్రములు, వెన్నెలవలె పెదవులపై చిరునగవు, లక్ష్మి అర్ధనిమీలిత నేత్రములతో, నిండిన హృదయంతో ఆవైపే చూచుచున్నది. శ్వాస నిశ్వాసలు అతివేగంగా నడుస్తున్నవి. అప్పుడే తలుపువద్ద ఏదో శబ్దము. లక్ష్మికి మెలుకువ వచ్చినది. ఎదుట గడియారంలో 5 ఘంటలు కావస్తున్నది.

మళ్లీ తలుపును కొట్టినట్టుగా ధ్వని వినిపిస్తుంది. లక్ష్మి లేచి కూర్చొని “ఎవరచ్చట అన్నది.”

“లక్ష్మి! లే మూర్తి వచ్చినాడు. మూర్తి …” కొన్ని క్షణములు ఆమె ఎచ్చటనున్నది, ఏమిచేస్తున్నది ఆమెకే తెలియదు. కింకర్తవ్యవిమూఢవలె అలాగే కూర్చొన్నది. చైతన్యము వచ్చినది. మెల్లగా పులకిత శరీరంతో తలుపుతీసి కొన్ని క్షణములచ్చటనే అనిశ్చితముగా నిలుచబడ్డది. పరుగెత్తుకొని ఆయనవద్దకు వెళ్ళవలెనని అనుకొన్నది. కాని ఆమె వివేకశక్తి అందు కంగీకరించలేదు. అప్పుడే మూర్తి ఎదురుగా వచ్చుచున్నట్లు చూచినది. ఆరోగ్యవంతమైన ముఖము, చాల విలువైన సూటు, చేతికి బహుమూల్యమైనవాచి. మూర్తిని చూస్తూ లక్ష్మి కండ్లార్చడమే మరచిపోయినది.

మూర్తి దగ్గరకొచ్చి ప్రేమ పూరితమైన స్వరంతో 'లక్ష్మీ' అన్నాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొంటూ నన్ను క్షమించవూ ?

"క్షమించుట ... ఎందుకు ?" ఆమె కంఠం ఆగిపోయినది.

"అపరాధివలె వెళ్ళిపోయినందుకు ?"

"ఎవడు స్వయంగా తనకు అపరాధము చేసుకొన్నాడో వాడు ప్రపంచంలో మరెవ్వడికి అపరాధి కాజాలడు" అని లక్ష్మి గంభీర స్వరముతో అన్నది.

కొన్ని క్షణములవరకు మూర్తి విస్మయముతో నిండిన దృష్టితో ఆమెను చూచినాడు. లక్ష్మి, తను కనపడగనే ఏడ్చి క్షమించ ప్రార్థించునని మూర్తి అనుకొన్నాడు. కాని ఆమె యిలా జవాబిచ్చునని అతను ఎన్నడూ ఊహించలేదు. పతియే తన సర్వస్వమని భావించుకొని 'ప్రేమముగ్ధురాలైనటువంటి ఆ నా లక్ష్మియేనా యీమె ?'

"నేనేమయిన తప్పు అన్నానా" అన్నది లక్ష్మి.

"లేదు, నీవు అన్నది నిజమే."

"మీ ప్రశ్నకు జవాబు లభించినదా ?"

"ఆ ప్రశ్న ఏమిటో అడకకుండానే జవాబును గురించి అడుగుచున్నావేమి ?"

"ప్రశ్న ... ఆ ప్రశ్న నడుగుటకు నేనెవతెను ?"

మూర్తి దగ్గరగా నవ్వుతూ "ఓ, అమ్మగారికి కోపం వచ్చినదా ?"

"కోపమా ?" లక్ష్మి తన తలపైకెత్తి "నాకెలాంటి కోపము మీపైలేదు. ఒక వ్యక్తి, వ్యక్తిగత జీవితముపై మరొక వ్యక్తికి ఎలాంటి అధికారము లేదు. భార్యాభర్తలయినాసరే."

"పెద్ద వేదాంతికవయినావే నీవు ?"

"లేదు. అలాంటిదేమిలేదు. మీ ప్రశ్నకు జవాబందినదా ?"

"మొదట ఆ ప్రశ్న ఏమిటో విను."

"చెప్పండి."

"గీత వంటి పుస్తకములలో మానవుడు స్థితప్రజ్ఞుడు కావలెనని భగవంతుడు ఆదేశించినాడుగదా? అలాంటప్పుడు ఆ భగవంతుడే యీ ప్రపంచములో యిన్ని చిత్రవిచిత్రములైన వస్తువులను ఎందుకు సృష్టించినాడు ? అన్న ప్రశ్న నాలో ఉదయించినది. దానికి జవాబు పొందుటకే నేను వెళ్ళినది. హిమాలయ పర్వతములలో యోగులు, సాధు సన్యాసులు ఉన్నారని విన్నాను. బ్రహ్మజ్ఞానులని గూడ విన్నాను. కనుక వారివద్దకు వెళ్ళి వారి సేవా శుశ్రూష చేసిన నా ప్రశ్నకు జవాబురాగలదని ఆశించినాను. ఈ ఎనిమిది సంవత్సరములు ఆ పర్వతములలోనున్న యోగి పుంగవులను సందర్శించుచూ గడిపినాను. కాని లాభంలేకపోయినది. ఎచ్చట నా ప్రశ్నకి సరియైన జవాబులేదు. కనుక ఏకాంతవాసినై యిలా తిరుగుట వ్యర్థమని జీవితముయొక్క లక్ష్యము భోగించడమేనని నిశ్చయించుకొన్నాను."

"అప్పుడు."

"అప్పుడేమిటి, నీ వద్దకు తిరిగివచ్చినాను. వస్తూ వస్తూ నీకు అనేక రకములైన చీరెలు, ఆభరణములు తెచ్చినాను. అవిగో అచ్చట చూడు నీకేమి యిష్టమో ?"

ఈ మాటలు విన్నతరువాత లక్ష్మికి, తన భర్త పాండిత్యము విద్వత్తుపైనున్న శ్రద్ధాభావము గాలిలోని దుమారమువలె ఎగిరిపోయినది. ఆకస్మికముగా ఆమె తన భర్తకు తన హృదయంలోనున్న ఉచ్చస్థానము, పూజ్యభావము కోల్పోతున్నట్లు అనుభవించినది. తన భర్తకూడ ఒక అతిసాధారణ వ్యక్తేనని, మామూలుగా జాగరూకులైన వ్యక్తుల మనస్సులలో ఉదయించెడి భావములే ఆయనలో ఉదయిస్తున్నవని ఆమె అనుకొన్నది. ఏవిధముగా కూడ తన భర్త ఒక విశిష్టమైన వ్యక్తికాదని, ఆమె కంటె ఆయన ఏదృష్టిలోగూడ ఎక్కువకాదని ఊహించుకొన్నది.

♦ ♦ ♦

కొన్ని రోజుల తరువాత ప్రొఫెసర్ మూర్తి అసిస్టెంటు ప్రొఫెసరయిన తన భార్య లక్ష్మి సంఘంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకో గలిగినదని తెలుసుకొన్నాడు. ఇప్పుడు ఆమెను తన యింటి నాలుగు గోడలమధ్య ఉంచడం తనకు సాధ్యంకాదని గ్రహించినాడు. లక్ష్మి తన ప్రతిభా విశిష్టతవల్ల దేశంలో తనకంటె ఎన్నోరెట్లు ఖ్యాతిని గౌరవమును పొందగలిగినదని అర్థంచేసుకోగలిగి నాడు. అయితే జీవితంలో బుద్ధభగవానుడు కావలె నన్న తన రమ్య స్వప్నము సుదూర మార్గంలో కన్పించే దీపపుకాంతివలె అంధకారములో విలీనమై పోయినందుకు చింతించినాడు.

—o—

ఒక వయసు మీరిన యువతి తన స్నేహితుని "ఏమండీ! నా వయస్సు ఏమి యుంటుందని మీ యూహ" అని ప్రశ్నించింది.

"నాకలా యూహించగల శక్తిలేదు"

"అదేమిటి! అలాగంటారు - మీ మనసులోనున్నది. చెప్పండురూ!"

"ఇందులో నాకు సంకట మేమిటంటే— మీ అందమును బట్టి 10 సంవత్సరములు చిన్నగా యూహించడమా! లేక మీ తెలివి తేటల నాధారంగా చేసికొని 10 సంవత్సరములు పెద్దగా చేయడమా అనేది"

♦ ♦ ♦

పుట్టినరోజు పండుగనాడు అల్లునికి మామ పిల్లనగ్రోవిని తెచ్చి బహూకరించి "ఊదడం తెలుసా" అని అడిగాడు.

ధన్యవాదాలు తెలుపుతూ "తెలియదు మామగారూ! - కాని అమ్మ పగలు పూట ఊదవద్దని ప్రతివారం నాలుగణాలు, రాత్రిపూట ఊదవద్దని నాన్న ఆరణాలు యిస్తారు" అన్నాడు అల్లుడు.

♦ ♦ ♦

ఫోటో గ్రాఫిక్ స్టూడియోకు వెళ్లి తాను తీయించుకొనిన ఫోటోనుచూస్తూ "ఇందులో సహజమైన వయస్సుకంటె ముదురుగా కనుపిస్తున్నాను" అన్నాడు.

ఫోటోగ్రాఫర్ "అయితేఏం! ముందు ముందు ఫోటోతీయించుకోవలసిన అవసరం లేకుండా పోతుంది" అన్నాడు.

♦ ♦ ♦

ఒక కవికుమారుడు తన మిత్రునితో "పాటలను నిర్విరామంగా వ్రాస్తున్నాను" అన్నాడు.

"వేనినైనా అమ్మేవా!"

"అమ్మక పోవడమేమిటి! - సైకిలును, ఫౌంటెన్ కలాన్ని. చేతిగడియారాన్ని..."